



స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం అక్షరసత్యం
తెలుగు దినపత్రిక




వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 320 | ఎడిటర్ : డి.శివకృష్ణ | గురువారం | 14-05-2026 | పేజీలు : 04 | వెల : 2/-
WARANGAL | VOL : 01 | ISSUE : 320 | EDITOR : D.SHIVAKRISHNA | THURSDAY | 14-05-2026 | PAGES : 04 | PRICE : 2/-
Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

# వరి మద్దతు ధర భారీగా పెంపు



**ఢిల్లీ:**
ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి తీపి కబురు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా పంటల కనీస మద్దతు ధర పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా, **(మిగతా 2లో..)**

# హైదరాబాద్‌లో ఉబెర్ విస్తరణ



**స్టార్‌త్రినేత్రం, హైదరాబాద్:**
తెలంగాణలో తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రముఖ అంతర్జాతీయ రవాణా సేవల సంస్థ 'ఉబెర్' సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉబెర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో **(మిగతా 2లో..)**

# ప్రతీ ఆదివారం పెట్రోల్ బంకులు బంద్!



**ఢిల్లీ:**
దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. మే 14 నుంచి దేశంలోని ఎనిమిది ప్రధాన రాష్ట్రాల్లో ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులను మూసివేసేలా నిబంధనలు అమలు చేయనున్నట్లు సమాచారం. ఇంధన పొదుపు విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటికే ఇంధన కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రధాని తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు. అనవసరపు ఇంధన వృధాను అరికట్టేందుకు ఆయన తన పర్యటనల్లో పొదుపు చర్యలు ప్రారంభించారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. **(మిగతా 2లో..)**

# సామాన్యుడికి బ్యాడ్ న్యూస్



**ఢిల్లీ:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో దేశీయంగా చమురు ధరలు పెరగనున్నాయనే ప్రచారం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం మరింత కాలం పాటు కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాల్సి రావచ్చని తెలిపారు. తాజాగా స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించింది. చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇంకెంత కాలం సాధ్యమవుతుంది అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. **(మిగతా 2లో..)**

# బండి భగీరథ్ అరెస్ట్‌ను ఆపడం ఎవరి వల్లా కాదు

## టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్



**స్టార్‌త్రినేత్రం, హైదరాబాద్:**
బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసు వ్యవహారంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం జరగడం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతూనే ఉందని చెప్పారు. తప్పకుండా భగీరథ్‌ను అరెస్ట్ చేస్తారని.. ఇందులో అనుమానమే లేదని అన్నారు. అరెస్ట్ అవ్వకుండా ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పారు. భగీరథ్‌ను తప్పించే అవసరం మాకు లేదని వెల్లడించారు. ప్రస్తుతం భగీరథ్ పరారీలో ఉన్నాడని తెలిసింది. ఈ గ్యాప్‌లోనే విదేశాలకు వెళ్లాడని మాత్రం అనుకోవడం లేదని అన్నారు. ఒకవేళ నిజంగానే విదేశాలకు వెళ్లినా, రప్పించడం, తిరిగి తీసుకురావడం పెద్ద కష్టమేమీ కాదని తెలిపారు. **(మిగతా 2లో..)**

# బంగారం కొనడం తగ్గించుకోవాలి..

## కిమ్స్ సభలో చంద్రబాబు

**స్టార్‌త్రినేత్రం, అమరావతి:**



రాష్ట్ర ప్రజలు బంగారం కొనుగోలును తగ్గించుకోవాలని, ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇస్తున్న సూచనలను అందరూ పాటించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం అమరావతిలోని నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి, బైసర్ స్కిల్ యూనివర్సిటీలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. **(మిగతా 2లో..)**

# సాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం



**స్టార్‌త్రినేత్రం, హైదరాబాద్:**
సింగోటం-గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని రైతు వేదిక వద్ద సంగినేనిపల్లీ, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూ బాధిత రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై, వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎకరాకు రూ. 11.50 లక్షల పరిహారం..**

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మార్కెట్ విలువ రూ. 1,87,500 తక్కువగా ఉందంటూ రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. బేసిక్ మార్కెట్ విలువను తక్షణమే రెండింతలు పెంచి రూ. 3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన విలువ (రూ. 3,75,000) ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు, గెజిట్ ప్రచురించిన నాటి నుంచి వడ్డీని కూడా కలిపి ఎకరాకు మొత్తం రూ. 11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయం పై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తక్షణమే అవార్డు కాపీలు మంజూరు చేసి పరిహార పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యాన్ని మంత్రి ఆదేశించారు. **(మిగతా 2లో..)**

# శ్రీ వీరాంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**స్టార్‌త్రినేత్రం, నందిగామ:**
శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అందరికీ మంచి జరగాలని మాజీ మంత్రి హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్‌లు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని చేగూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరాంజనేయ స్వామి **(మిగతా 2లో..)**

# మేము ఫొటోలు దిగి హడావిడి చేయం: కవిత



**స్టార్‌త్రినేత్రం, హైదరాబాద్:**
నీటి ప్రాజెక్టుల అంశాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆంధ్రప్రదేశ్ గోదావరి, కృష్ణా నదులపై ఒక్కో ప్రాజెక్టులకు మూడు విధానాలు అమలు చేస్తున్నారని అందులో ఒకటి విఫలమైతే మరొకటి ఆచరణలోకి తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. ఏపీ చేస్తున్న ప్రత్యామ్నాయాలు సరే మనం ఎందుకు ఆ రకంగా చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టుల కోసం లక్ష 80 వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా వేలాది కోట్లు నిధులు ఖర్చు చేస్తామంటున్నారు. కానీ ఇప్పటి వరకు గోదావరి, కృష్ణా నీళ్లలో పూర్తి వాటా వాడుకోలేకపోతున్నామన్నారు. మేము అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేసి ఈ రెండు నది జలాలను సమర్ధవంతంగా వినియోగించుకుంటామన్నారు. జూరాల నుంచి ఏపీకి నీళ్లు వెళ్లే వరకు చిన్న ఆనకట్టు కూడా లేదన్నారు. మేము అధికారంలోకి వచ్చాక వందేళ్లు మన్నిక కలిగి ఉండేలా గేట్లతో కూడిన చెక్ డ్యామ్ లు నిర్మిస్తామన్నారు. గతంలో బీఆర్ఎస్ మాదిరిగా కొట్టుకుపోయేలా చెక్ డ్యామ్ నిర్మించి రెండు ఫోటోలు తీసుకునేలా కాకుండా శాశ్వతంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. నీటి విషయంలో మా అంతవారే లేరు అని చెప్పుకునే బీఆర్ఎస్ నుంచి ప్రధాన మంత్రి వస్తే ఒక్క ప్రశ్నకూడా ఎందుకు అడగలేదని నిలదీశారు. తెలంగాణ ఏర్పడిందే నీళ్ల కోస అన్నారు. బనకచర్ల విషయంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలుస్తామన్నారు.

# బంగారం కొనడం తగ్గించుకోవాలి..

## కిమ్స్ సభలో చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

**త్వరలో 'వర్క్ ఫ్రమ్ హోమ్'పై ప్రకటన**

దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే బంగారంలో సుమారు 50 శాతం వాటా ఒక్క కర్నూలు జిల్లా నుంచే వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే, విలాసాల కంటే పొదుపుపై దృష్టి సారించాలని కోరారు. 'ప్రస్తుతం కాన్వాయ్ అనేది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. భద్రత అనేది అర్థవంతంగా ఉండాలి తప్ప, ఆడంబరంగా ఉండకూడదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ గురించి నేను ఎప్పుడో చెప్పాను, ఇప్పుడు మళ్లీ అదే ట్రెండ్ వస్తోంది. దీనిపై రేపో ఎల్లుండో ప్రభుత్వం తరఫున ఒక కీలక ప్రకటన చేయబోతున్నాం' అని ఆయన తెలిపారు.

**హైదరాబాద్ కంటే మెరుగ్గా అమరావతి**

రాజధాని అమరావతి భవిష్యత్తుపై ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. 'నేను తొలిసారి ముఖ్యమంత్రి అయ్యే నాటికి హైదరాబాద్‌లో కనీస వైద్య సదుపాయాలు, ఆస్పత్రులు ఉండేవి కావు. గల్ఫ్ దేశాల్లోని హాస్పిటాలిటీ రంగాన్ని అధ్యయనం చేసి అక్కడ ఎన్నో సంస్కరణలు తెచ్చాను. ఇప్పుడు అమరావతిని హైదరాబాద్ కంటే మెరుగైన నగరంగా తీర్చిదిద్దుతాం. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని కోరారు.

**లక్ష ఉద్యోగాలే లక్ష్యం..**

కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమేనని, లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సీఎం స్పష్టం చేశారు. నిడమర్రులో శంకుస్థాపన చేసిన కిమ్స్ ఆస్పత్రిని 2027 మే 13 నాటికి పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన అనుమతులను ప్రభుత్వం త్వరితగతిన మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, కిమ్స్ ఆస్పత్రి ప్రతినిధులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అసైన్డ్, పట్టా లేని రైతులకు సమన్యాయం..

సాధారణ పట్టాదారులతో పాటే అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా ఇదే తరహా పరిహారాన్ని వర్తింపజేయాలని బొల్లారం గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. అసైన్డ్ పట్టా దారులకు సమాన పరిహారం అందించడంతో పాటు, ఎలాంటి పట్టాలు లేకుండా చాలా కాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని ట్రిపుల్ ఆర్ ('3ఆర్) ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**40 వేల ఎకరాలకు సాగునీరు**

కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు పరిధిలో 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు.. మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి జూపల్లి వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికే 2018లో సింగోటం-గోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. ఈ కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు.

**భూసేకరణ వివరాలు:**

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి: 50 ఎకరాలు, వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం: 73 ఎకరాల 13 గుంటలు, వల్లభాపూర్: 87 ఎకరాల 3 గుంటలు, సంగినేనిపల్లి: 94 ఎకరాల 8 గుంటలు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బొల్లారం, తూముకుంట సర్పంచులు సుదర్శన్ రెడ్డి, రామన్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి ఒక చట్టం..
# కేంద్ర మంత్రి కుమారుడికి మరో చట్టమా?

**భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా రక్షిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్, కేంద్ర బీజేపీ!..**
**అధికార మదంతో కేసులను నీరుగార్చడం మహిళా లోకానికే అవమానం.**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి!**
**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ డిమాండ్**



**స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:** తెలంగాణ రాష్ట్రంలో సామాన్యులకు ఒక చట్టం.. ప్రముఖులకు మరో చట్టం అమలవుతుందా..? అని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో అరూరి రమేష్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ పోక్సో కేసు నమోదు అయినా ఆ నిందితులను వెంటనే అరెస్టు చేసి విచారణ వేగవంతంగా పూర్తి అవుతుందని.. కానీ బండి సంజయ్ కొడుకు విషయంలో మాత్రం ప్రత్యేక చట్టాలు అమలు అవుతున్నట్లు కనిపిస్తుందని ఎద్దేవా చేశారు.

రేవంత్ రెడ్డికి.. భారతీయ జనతా పార్టీకి లోపాయికారి ఒప్పందం వల్లే బండి భగీరథ విషయంలో ఇంకా అరెస్టు జరగలేదని విమర్శించారు. కేసును నీరు గార్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని.. రాష్ట్రంలో జరిగే ప్రతి పోక్సో కేసు పై సిట్ వేసి విచారణ చేస్తారా.? అంటూ విమర్శించారు.

కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ సామాజిక బాధ్యతగా.. బేషరతుగా తన కుమారుడిని పోలీసుల ఎదుట హాజరు పరిచి విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేసును నీరుగార్చాలని ప్రయత్నాలు చేస్తే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలని అరూరి రమేష్ డిమాండ్ చేశారు.

**శాంతి భద్రతలు కరువయ్యాయి.. ఎక్కడ చుసినా దాడులు దౌర్జన్యాలు..**

10 ఏళ్లలో కెసిఆర్ హయాంలో ఆర్థికంగా అభివృద్ధి చెందితే.. రెండున్నర ఏళ్లలో క్రైమ్ లో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలు అయినా ఒక్క పెట్టుబడి రాలేదు కానీ.. రోజుకో అత్యాచారం జరుగుతుందన్నారు. ఇకనైనా ప్రభుత్వం మేలుకొని బాధితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్లు వనం రెడ్డి, జక్కు రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, పట్టణ మాజీ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, పీఏసీఎస్ డైరెక్టర్ మార్త సారంగపాణి, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు శ్రీధర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పూజారి రఘు, ఎలికట్టే యాకయ్య, తుమ్మల శ్రీధర్, బానోత్ నవీన్, తుమ్మల కుమారస్వామి, ఇలబెల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# వరి మద్దతు ధర భారీగా పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం సవరించింది. పంట పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి కొత్త ధరలను నిర్ణయించారు. సాధారణ వరి రకానికి కనీస మద్దతు ధరను రూ.2,441 గా ఖరారు చేశారు. నాణ్యమైన వరి గ్రేడ్-ఏ రకానికి మద్దతు ధరను రూ.2,461 గా నిర్ణయించారు. జొన్నలు హైబ్రిడ్ క్వింటాల్‌కు మద్దతు ధర రూ.4,023, మల్దండి జొన్నలు రూ.4,073, సజ్జలు రూ.2,900, రాగులు రూ.5,025, మొక్కజొన్న రూ.2,410, కందులు రూ.8,450, పెసర్లు రూ.8,780, మినప క్వింటాలుకు మద్దతు ధర రూ.8,200గా నిర్ణయించారు. అదేవిధంగా రాబోయే ఖరీఫ్ పంటల మద్దతు కోసం ప్రభుత్వం ఏకంగా రూ.2.6 లక్షల కోట్లను కేటాయించింది.

నాగ్‌పూర్ విమానాశ్రయానికి మహర్దశ..

వ్యవసాయంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ ప్రాధాన్యం ఇచ్చింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఇంటర్నేషనల్ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో రవాణా, పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది. పర్యావరణ హితమైన ఇంధన ఉత్పత్తి , విద్యుత్ రంగంలో స్వావలంబన కోసం 'కోల్ గ్యాసిఫికేషన్' పథకానికి కేంద్రం రూ.37,500 కోట్లను కేటాయించింది. దీంతో ఎల్ఎన్‌జీ దిగుమతి భారం మరింత తగ్గనుంది. సర్కేజీ - ధోలేరా మధ్య సెమి హై స్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి రూ.20,065 కోట్ల కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ప్రతీ ఆదివారం పెట్రోల్ బంకులు బంద్!

(మొదటి పేజీ తరువాయి)

**పర్యావరణ హితం..**

కర్బన ఉద్గారాలను తగ్గించి, పర్యావరణాన్ని కాపాడేందుకు ఆదివారం సెలవు ప్రకటించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తొలి దశలో భాగంగా ఎంపిక చేసిన 8 రాష్ట్రాల్లో ఈ నిబంధనలు అమలు కానున్నాయి. ప్రధాని మోడీ బాటలోనే సామాన్య ప్రజలు కూడా అనవసరంగా వాహనాలు వాడకుండా ఇంధనాన్ని పొదుపు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. అయితే, ఆదివారం బంకులు బంద్ అని సోషల్ మీడియాలో వార్తలు జోరుగా ప్రచారమవుతున్నప్పటికీ, దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ నుండి గానీ, చమురు సంస్థల నుండి గానీ ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి వాహనదారులు తమ ప్రాంతంలోని బంకుల వద్ద సమాచారాన్ని సరిచూసుకోవాలని సూచించడమైనది.

# సామాన్యుడికి బ్యాడ్ న్యూస్ ..

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను బట్టి చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారి తీస్తుందన్నారు. దేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని మరియు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛంద పొదుపును కోరిన నేపథ్యంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**భవిష్యత్‌పై ఆందోళన:**

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.9 శాతంగా, ద్రవ్యోల్బణం సగటున 4.6 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది. అయితే యుద్ధం కారణంగా వృద్ధి నెమ్మదించి, ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఆర్బీఐ తన కీలక పాలసీ రెపో రేటును ఏప్రిల్‌లో 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. భారతదేశ ద్రవ్యోల్బణం మార్చిలోని 3.40 శాతం నుండి ఏప్రిల్‌లో 3.48శాతానికి స్వల్పంగా పెరిగింది. ప్రభుత్వం పెరిగిన ముడి చమురు ధరలను భరించడంతో ఇది అంచనాల కంటే తక్కువగా నమోదైంది. అయినప్పటికీ, మధ్యప్రాచ్య సంఘర్షణ కారణంగా పెరుగుతున్న ఇంధన ధరలు భవిష్యత్ అంచనాలపై ప్రభావం చూపుతుండటంతో భవిష్యత్?పై ఆందోలన నెలకొంది.

**వడ్డీ రేట్లు పెంచాలి:**

రూపాయిని కాపాడాలంటే ఆర్‌బిఐ వడ్డీ రేట్లు పెంచాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. నాటిక్సిస్ సీనియర్ ఆర్థికవేత్త ట్రిన్ గుయెన్ మాట్లాడుతూ.. ఇంధన ధరలను కృత్రిమంగా తక్కువగా ఉంచడం వల్ల డిమాండ్ అధికంగానే ఉంటుందన్నారు. కాబట్టి భారతదేశం పెరిగిన ఇంధన వ్యయాలను వినియోగదారులపైకి చేరనివ్వాలన్నారు. ఇది రూపాయిపై ఒత్తిడిని తగ్గించడానికి ఎలా సహాయపడుతుందో ఆమె వివరించారు. భారత కరెన్సీకి మద్దతు ఇవ్వడానికి మూలధన ప్రవాహాలను ఆకర్షించడానికి, ద్రవ్యోల్బణ ప్రమాదాలను అరికట్టడానికి ఆర్‌బీఐ ఇప్పుడు వడ్డీ రేట్లను పెంచాలని ఆమె సూచించారు.

# బండి భగీరథ్ అరెస్ట్‌ను ఆపడం ఎవరి వల్లా కాదు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు.. బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ కేసు విచారణను వేగవంతం చేస్తూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే కాసేపట్లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్ విచారణకు హాజరు కావాల్సి ఉంది. దీంతో భగీరథ్ హాజరుపై ఉత్కంఠ నెలకొంది.

# హైదరాబాద్‌లో ఉబెర్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ఉబెర్ కార్యకలాపాల విస్తరణ, కొత్త పెట్టుబడులపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఉబెర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని ఈ సందర్భంగా సీఇవో ఖోస్రోషాహి తెలిపారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను విస్తరిస్తున్నట్లు సీఎంకు వివరించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్?లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని వివరించిన దారా ఖోస్రోషాహి.. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తితో ఉన్నట్లు తెలిపారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని దారా ఖోస్రోషాహికి సీఎం సూచించారు. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబెర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన సీఎం.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ముఖ్యమంత్రి సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబెర్ ఉబెర్ ప్రతినిధులకు సీఎం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరాంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహ ప్రతిష్టాపనకు మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. వీరాంజనేయ స్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమ్మద్ అలీ, ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, వై రవీందర్ యాదవ్,, సత్యనారాయణ నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, మామిళ్ళ విటల్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా అభివృద్ధికి గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకం

**ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలి..**
**సర్పంచులు, కౌన్సిలర్లు విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపు..**
**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాల వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే నాగరాజు**




**స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:** వరంగల్ జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం వర్ధన్నపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా ఐఏఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రతి గ్రామంలో విద్యా వికాసం జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం చాలా అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థలు కలిసి పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.

ప్రతి గ్రామంలో పాఠశాలల పరిస్థితిని సర్పంచులు తరచూ పరిశీలించాలని, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను కూడా పెంచుతున్నాయని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామస్థాయి అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోందని, ప్రతి శాఖ ప్రజలకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణలు చేపడుతోందన్నారు. విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి – రాజేందర్, వర్ధన్నపేట ఫ్యాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా, మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లి–కీమా నాయక్, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి–కుమారస్వామి, సర్పంచులు, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఆర్డిఓ సుమ, ఎంపీడీవో, ఎంఈఓ ప్రజాప్రతినిధులు, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్-2026 ప్రవేశ పరీక్ష

**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట :**




జిల్లా పరిధిలో నిర్వహించిన పాలిసెట్--2026 ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్షకు మొత్తం 94.2 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. సిద్దిపేట పరిధిలో ఏర్పాటు చేసిన 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,912 మంది అభ్యర్థులకు గాను 2,743 మంది పరీక్ష రాశారు. ఇందులో 1,359 మంది బాలురకు గాను 1,279 మంది హాజరుకాగా, 1,553 మంది బాలికలకు గాను 1,464 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణను ప్రత్యేక పరిశీలకులుగా కుమారి ఎ. మాలతి పర్యవేక్షించగా, ప్రత్యేక తనిఖీ అధికారులుగా రెవెన్యూ శాఖకు చెందిన శ్రీ ఫయీముద్దీన్ డీటీ, పోలీసు శాఖకు చెందిన శ్రీ డీవీఆర్ పాటిల్ ఏఆర్ఎస్ఐ విధులు నిర్వహించారు. పాలిసెట్–2026 పరీక్ష ఫలితాలను మరో పది రోజులలో విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణకు సహకరించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు మరియు పాత్రికేయ మిత్రులకు పాలిసెట్ సమన్వయ అధికారి శ్రీ అలుగోజు గోవర్ధన్, ఉప సమన్వయ అధికారి శ్రీ బూరం అభినవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హయత్ నగర్‌లో నోరూరించే రుచులతో 'బాస్ బిర్యాని' ఘనంగా ప్రారంభం

**స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:**



హయత్ నగర్ లోని భోజన ప్రియులకు సరికొత్త రుచులను పరిచయం చేస్తూ 'బాస్ బిర్యాని' హోటల్ బుధవారం వినాయక నగర్ మెయిన్ రోడ్డులోని అపోలో ఫార్మసీ పక్కన ఘనంగా ప్రారంభమైంది. గతంలో 'బాస్ బకెట్'గా సుపరిచితమైన ఈ కేంద్రాన్ని ఇప్పుడు పేరు మార్చి, మరింత నాణ్యమైన వంటకాలతో 'బాస్ బిర్యాని'గా తీర్చిదిద్దినట్లు నిర్వాహకుడు రాజశేఖర్ వెల్లడించారు. ప్రారంభోత్సవ సందర్భంగా వినియోగదారుల కోసం వారు అదిరిపోయే ఆఫర్లను ప్రకటించారు. కేవలం 99 రూపాయలకే రుచికరమైన బిర్యానిని అందిస్తుండటంతో పాటు, ఒక ఫుల్ బిర్యాని కొనుగోలు చేసిన వారికి ఒక సింగిల్ బిర్యాని ఉచితంగా ఇచ్చే 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ బిర్యానితో పాటు చైనీస్ వంటకాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆస్వాదించే వారి కోసం ఫ్యామిలీ మరియు జంబో ప్యాక్‌లు సిద్ధంగా ఉన్నాయని, ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. కేవలం హోటల్‌లోనే కాకుండా చిన్న, పెద్ద ఫంక్షన్లకు ఆర్డర్ల మేరకు క్యాటరింగ్ మరియు డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం లేదా ఆర్డర్ల కోసం 98881 29994 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకుడు రాజశేఖర్ సూచించారు. హయత్ నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్ కోరారు.

# అధిక లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

**AMVI కారుకు ప్రమాదం**
**హోం గార్డ్‌కు గాయాలు – పోలీసులు కేసు నమోదు**

**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట:**




చిన్న కోడూరు మండలం శనిగరం రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వాహనం తీవ్రంగా దెబ్బతిన్నది. వాహన తనిఖీల్లో భాగంగా శ్రీకాంత్ రెడ్డి తన బృందంతో అక్కడికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, అధిక లోడుతో వెళు న్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దాంతో అదుపుతప్పిన ట్రాక్టర్ పక్కనే నిలిపి ఉంచిన AMVI శ్రీకాంత్ రెడ్డి కారును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో శ్రీకాంత్ రెడ్డి కారులో లేకపోవడంతో ఆయనక ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయితే కారులో ఉన్న హోం గార్డ్ శ్రీరాం రాముకు గాయాలయ్యాయి. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఘటనపై చిన్న కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వనస్థలిపురంలో ఓరిజిన్ సెలూన్ ఘనంగా ప్రారంభోత్సవం

**ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**స్టార్ త్రినేత్రం, వనస్థలిపురం:**



వనస్థలిపురంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన నిర్వాహకులు యోగీశ్వర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఓరిజిన్ యూనిసెక్స్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్వాహకులు యోగిశ్వర్ రెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలకి ఎదురు చూడకుండా వ్యాపార రంగాన్ని ఎంచుకొని స్వయం కృషితో ఎదగాలని సూచించారు. ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక హెయిర్ స్టైల్, స్కిన్ కేర్ బ్యూటీ సేవలతో ఈ ఓరిజిన్ సెలూన్ ని ప్రజలకి అందుబాటులోకి తేవడం అభినందనీయమని పేర్కొన్నారు. యువతకు ఫ్యాషన్, గ్రూమింగ్ రంగంలో నాణ్యమైన సేవలు అందించడం సంతోషించ దగ్గ విషయమని తెలిపారు. అనంతరం యోగీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వనస్థలిపురం వంటి ఏరియాలో తమ యొక్క ఓరిజిన్ సెలూన్ ని నూతనంగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు, పురుషులు, పిల్లలు అందరికీ ఒకే చోట నాణ్యమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అత్యుత్తమ నాణ్యత కలిగిన ప్రొడక్ట్స్ తో పాటు అనుభవజ్ఞులైన స్టైలిస్ట్ లు సేవలు అందిస్తారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు సరికొత్త స్టైల్ లలో సేవలు అందించడానికి తాము సిద్ధంగా ఉందామని ఉన్నామని హామీ ఇచ్చారు. మొత్తానికి స్టైలిష్ లుక్ కోసం వెయిట్ చేస్తున్న వారికి ఓరిజిన్ సెలూన్ ఒక వన్ స్టార్ డెస్టినేషన్ గా మారనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన అరూరి రమేష్

**స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:**



వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రం లోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్ లో వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ కుమార్తె చి.ల.సౌ.నవ్య–అనిల్‌ల వివాహం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయన వెంట పట్టణ మాజీ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, మండల మాజీ అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ మార్త సారంగపాణి, పూజారి రఘు, సిలివేరు శ్రీధర్ యాదవ్, ఎలికట్టే యాకయ్య, తుమ్మల శ్రీధర్, బానోత్ నవీన్, ఇలబెల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్ర సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**స్టార్ త్రినేత్రం, ఉప్పల్:**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం నూతన భవనాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గంగపుత్రుల సంక్షేమం, అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గంగపుత్ర సంఘం భవనం నిర్మాణం సంఘ కార్యకలాపాలకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. స్థానిక ప్రజలు, సంఘ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవనం నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు.

# ఎయిర్ పోర్ట్ లో సందడి చేసిన చై- శోభిత..



అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల జంట ఎక్కడ కనిపించినా ఆ సందడే వేరు. తాజాగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఈ జంట కెమెరా కంటికి చిక్కింది. అయితే ఇక్కడ విశేషం ఏమిటంటే.. అర్ధరాత్రి సమయంలో కూడా మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు తమ కోసం వేచి ఉండటం చూసి శోభిత ఆశ్చర్యపోయారు. వారి వృత్తి పట్ల ఉన్న అంకితభావాన్ని మెచ్చుకుంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఫోటోగ్రాఫర్ల పనికి శోభిత ప్రశంసలు:

చైతన్య, శోభిత ఎయిర్ పోర్ట్ నుండి బయటకు రాగానే ఫోటోగ్రాఫర్లు వారిని క్లిక్ మనిపించేందుకు పోటీ పడ్డారు. సమయం చాలా రాత్రి అయినప్పటికీ, ఏమాత్రం అలసట లేకుండా వారు పని చేయడం చూసి శోభిత ముచ్చటపడ్డారు. కారు ఎక్కబోయే ముందు వారి వైపు తిరిగి.. "మీరు అసలు పడుకోరా? ఇంత టైమ్ లో కూడా ఇంత కష్టపడుతున్నారు" అని నవ్వుతూ అడిగారు. వారి పనిని అభినందిస్తూ ఆమె చేసిన ఈ కామెంట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.

వృషకర్మ గా చైతన్య సాహసం:

గతేడాది 'తండేల్' సినిమాతో మాస్ హిట్ అందుకున్న నాగచైతన్య, ఇప్పుడు 'వృషకర్మ' అనే కొత్త ప్రాజెక్ట్ తో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో వస్తున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ లో చైతన్య 'అర్జున్' అనే నిధి అన్వేషకుడిగా కనిపిస్తున్నారు. ఇక రీసెంట్ గా విడుదలైన గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచేశాయి. ఈ పాన్ ఇండియా మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది.

'చీకటి'లో శోభిత సక్సెస్:

మరోవైపు శోభిత ధూళిపాళ్ల కూడా వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో వచ్చిన 'చీకటి' క్రైమ్ థ్రిల్లర్ లో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. ఇక విశ్వదేవ్ రాచకొండ, ఈషా చావ్లా కీలక పాత్రలు పోషించిన ఈ మూవీ శోభిత కెరీర్ కు పెద్ద ప్లస్ అయ్యింది.ప్రస్తుతం చైతన్య, శోభిత ఇద్దరూ తమ వృత్తిపరమైన బాధ్యతలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని కూడా చాలా హ్యాపీగా ఎంజాయ్ చేస్తున్నారు. వీరిద్దరూ కలిసి ఎప్పుడు బయట కనిపించినా ఆ ఫోటోలు నిమిషాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక అక్కినేని ఫ్యాన్స్ కూడా ఈ జంటను చూసి మురిసిపోతున్నారు. ముఖ్యంగా చైతన్య కొత్త సినిమా అప్డేట్స్ కోసం అభిమానులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. మొత్తానికి చై-శోభిత జోడీ ఎయిర్ పోర్ట్ లో చేసిన సందడి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. శోభిత వేసిన సెటైర్ ఒకెత్తయితే, చైతన్య 'వృషకర్మ' మూవీ మీద ఉన్న బజ్ మరొకెత్తు. అటు సినిమాలతో, ఇటు పర్సనల్ లైఫ్ తో ఈ జంట టాలీవుడ్ లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలుస్తోంది. ఇక వీరిద్దరికీ మరిన్ని విజయాలు అందాలని ఆశిద్దాం.

# ఏక్ దిన్.. ఆలోచన మార్చుకున్న సాయి పల్లవి?




సాయి పల్లవి ప్రస్తుతం ప్రతిష్టాత్మక 'రామాయణ' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రాముడి పాత్రలో రణబీర్ కపూర్ నటిస్తుండగా, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తోంది. రావణాసురుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ కనిపించబోతున్నాడు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా మొదటి పార్ట్‌ను ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. హిందీలో రూపొందుతున్న ఈ సినిమాను పలు భాషల్లో డబ్ చేయబోతున్నారు. ముఖ్యంగా హిందీతో పాటు, తమిళ్, తెలుగు, కన్నడం, మలయాళం, మరాఠి, బెంగాలీ భాషల్లో విడుదల చేయడం కోసం డబ్ చేయబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డబ్బింగ్ విషయమై పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారట. సినిమాలో నటించిన నటీనటులతో డబ్బింగ్ చెప్పించే ఆలోచనతో దర్శకుడు నితేష్ తివారీ ఉన్నారని బాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. సాయి పల్లవి డబ్బింగ్... రాముడి పాత్రలో నటించిన రణబీర్ కపూర్ చేత హిందీలోనే కాకుండా మరో రెండు మూడు భాషల్లోనూ డబ్బింగ్ చెప్పించేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన భాష పై పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు సాయి పల్లవి సైతం హిందీతో పాటు సౌత్‌లో అన్ని భాషల్లోనూ డబ్బింగ్ చెప్పబోతుందనే వార్తలు వస్తున్నాయి. గతంలో సౌత్ సినిమాలకు సాయి పల్లవి డబ్బింగ్ చెప్పింది. తెలుగు, తమిళ్, మలయాళ ప్రేక్షకులకు సాయి పల్లవి మాత్రమే కాకుండా ఆమె వాయిస్ పరిచయం. తన పాత్రలకు తగ్గట్లుగా సాయి పల్లవి డబ్బింగ్ చెప్పడం మనం చూశాం. అయితే హిందీలో సాయి పల్లవి డబ్బింగ్ విషయమై విమర్శలు ఎదుర్కొంది. తాజాగా సాయి పల్లవి హిందీలో నటించిన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కోసం సాయి పల్లవి సొంతంగా డబ్బింగ్ చెప్పడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఏక్ దిన్... ఏక్ దిన్ సినిమాలో సాయి పల్లవి హిందీ డబ్బింగ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా హిందీ భాషను ఆమె స్పష్టంగా పలకలేక పోయిందని, కొన్ని పదాలను ఉచ్చరించడంలో చాలా ఇబ్బంది పడ్డట్లుగా అనిపించింది. పైగా ఆమె బాడీ లాంగ్వేజ్‌కి హిందీ భాష సెట్ కావడం లేదని సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. సాయి పల్లవి ఏక్ దిన్ కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పి విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రామాయణ విషయంలో ఆలోచన మార్చుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. నితేష్ తివారీ ఇప్పటి వరకు సాయి పల్లవితోనే సీత పాత్రకు డబ్బింగ్ చెప్పించాలని భావించారని, కానీ ఏక్ దిన్ సినిమా తర్వాత ఆయన నిర్ణయంలో మార్పు ఉండే అవకాశం ఉందనే టాక్ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ప్రతిష్టాత్మక రామాయణ విషయంలో ఆయన ప్రయోగాలు చేయకుంటేనే ఉత్తమం అని పలువురు భావిస్తున్నారు. అలీ వివాదం చెప్పిన పాఠం రామాయణ మూవీలో... రామాయణ సినిమాలో డైలాగ్స్ మరింత కఠినంగా ఉంటాయి. హిందీలో స్పష్టంగా మాట్లాడలేని సాయి పల్లవితో డబ్బింగ్ చెప్పించడం అనేది సాహస నిర్ణయం అనే అభిప్రాయం మొదలైంది. అయితే సాయి పల్లవి తెలుగు, తమిళ్ ఇతర సౌత్ భాషల్లో డబ్బింగ్ చెప్పడం మాత్రం కన్ఫర్మ్. సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉంది కనుక అప్పటి వరకు ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పార్ట్ పూర్తి అయిందని, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. రామాయణ సినిమాల కారణంగా సాయి పల్లవి పలు సినిమాలను తిరస్కరిస్తూ వచ్చింది. షూటింగ్ పూర్తి అయిన నేపథ్యంలో సాయి పల్లవి కొత్త సినిమాలకు కమిట్ అవుతుందేమో చూడాలి. ప్రస్తుతం తమిళ్‌లో ధనుష్ తో ఒక సినిమాను చేస్తుంది, తెలుగులో ఈమె కొత్త సినిమాలు ఏమీ చేయడం లేదు. ఒకటి రెండు చర్చల దశలో ఉన్నాయని సమాచారం అందుతోంది.

# పాన్ ఇండియా తెలుగు చిత్రాలు.. నిర్మాత శిరీష్ క్వశ్చన్స్ ఏంటి?



తెలంగాణలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి, పర్సంటేజీ విధానం అమలుపై చర్చ మరింత వేడెక్కుతోంది. హైదరాబాద్ లో తెలంగాణ ఎగ్జిబిటర్స్ నిర్వహించిన ప్రెస్ మీట్ లో నిర్మాత శిరీష్ రెడ్డి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాలు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న షేరింగ్ విధానం గురించి ఆయన లేవనెత్తిన ప్రశ్నలు ఆసక్తికరంగా మారాయి. శిరీష్ రెడ్డి మాట్లాడుతూ.. "ఇప్పుడు తెలుగు సినిమా అనేది కేవలం రీజనల్ సినిమా కాదు. పాన్ ఇండియా స్థాయికి వెళ్లింది. హై బడ్జెట్ సినిమా అంటే ఇప్పుడు పాన్ ఇండియా మూవీ అనే భావన ఏర్పడింది. అలాంటప్పుడు బెంగళూరు, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో అమలవుతున్న పర్సంటేజీ విధానం తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు ఉండకూడదు?" అంటూ ప్రశ్నించారు. తెలుగు సినిమాలను దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆదరిస్తున్నప్పటికీ, మన సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి మాత్రం వీక్ గా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే శిరీష్ రెడ్డి వ్యాఖ్యల్లో ఇండస్ట్రీ వ్యవస్థపై అసంతృప్తి కనిపించిందనే అభిప్రాయం ఇప్పుడు వ్యక్తమవుతోంది. "మన సినిమా, మన హీరోలు, మన డైరెక్టర్లు.. కానీ మన థియేటర్ల పరిస్థితి ఏమిటి? పుష్ప మూవీని ఇండియా అంతా ఎంజాయ్ చేశారు. కానీ మనమక్కడ చేశాం?" అన్న ఆయన ప్రశ్న చర్చకు దారితీసింది. ముఖ్యంగా మల్టీప్లెక్సులు ఇప్పటికే పర్సంటేజీ మోడల్ ద్వారా లాభపడుతున్నాయని, సింగిల్ స్క్రీన్లకు మాత్రం అదే అవకాశం లేకపోవడం సరైన విధానం కాదని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం థియేటర్ల వ్యవస్థలో పెద్ద మార్పులు వస్తున్నాయని ఎగ్జిబిటర్లు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు సినిమాలు వారాల తరబడి ఆడేవని, ఇప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని గుర్తుచేస్తున్నారు. ఎఫ్ 2 వంటి కొన్ని చిత్రాలు మాత్రమే ఎక్కువ కాలం ప్రదర్శితమయ్యాయని, ప్రస్తుతం పెద్ద సినిమాలు కూడా రెండు మూడు వారాలకే పరిమితమవుతున్నాయని అంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాల రన్ కూడా తక్కువ రోజుల్లో ముగుస్తోందని వారు చెబుతున్నారు ఒకేసారి ఎక్కువ థియేటర్లలో సినిమాలు విడుదల కావడం, ఓటీటీ ప్రభావం, ఫస్ట్ వీక్ కలెక్షన్లపై పెరిగిన దృష్టి వంటి అంశాలు సింగిల్ స్క్రీన్లపై ప్రభావం చూపుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాత రెంటల్ విధానం కొనసాగించడం తమకు భారంగా మారుతోందని ఎగ్జిబిటర్లు వాపోతున్నారు. ప్రస్తుతం మల్టీప్లెక్సులు పర్సంటేజీ షేరింగ్ విధానంలో లాభాలు పొందుతున్నాయని, అదే విధానం సింగిల్ స్క్రీన్లకు కూడా అమలు చేస్తే పరిస్థితి కొంత మెరుగవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. కోవిడ్ తర్వాత థియేటర్ రంగం ఇంకా పూర్తిగా కోలుకోలేదని, నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కలిసి రిస్క్ ను పంచుకునే విధానం అవసరమని అభిప్రాయపడుతున్నారు. పర్సంటేజీ సిస్టమ్ అమలు చేస్తే కలెక్షన్లకు అనుగుణంగా ఆదాయం పంచుకోవచ్చని, దీంతో చిన్న థియేటర్లకు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. అయితే పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన తెలుగు సినిమా వ్యవస్థలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల ఫ్యూచర్ ఎలా ఉండబోతుందన్న ప్రశ్న ఇప్పుడు చర్చగా మారింది.

# టబు సింగిల్ గా ఉండటానికి కారణం వాళ్లేనా?




వెర్సటైల్ నటి టబు – అజయ్ దేవగన్ మధ్య ఉన్న స్నేహం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు కలిసి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. అయితే 50 ఏళ్లు దాటినా టబు ఇంకా పెళ్లి చేసుకోకుండా సింగిల్‌గా ఉండటంపై బాలీవుడ్ సహా టాలీవుడ్ మీడియాలో తరచూ చర్చ జరుగుతూనే ఉంది. తాజాగా ఓ ఇంట ర్వ్యూలో స్పందించిన టబు తాను ఇంకా పెళ్లి చేసుకోకపోవడానికి అజయ్ దేవగనే ప్రధాన కారణమని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టబు – అజయ్ దేవగన్ చిన్నప్పటి నుండే స్నేహితులు. అజయ్, టబు కజిన్ అయిన సమీర్ ఆర్యకు పక్కింటి అబ్బాయి ప్రాణస్నేహితుడు. టబు ఎదుగుతున్న క్రమంలో అజయ్ .. సమీర్ ఇద్దరూ ఆమెపై నిరంతరం నిఘా ఉంచేవారట. ఎవరైనా అబ్బాయి టబుతో మాట్లాడటానికి ప్రయత్నిస్తే ఇద్దరూ కలిసి వారిని బెదిరించడం ..కొట్టడానికి వెళ్లడం చేసేవారని టబు గుర్తు చేసుకున్నారు. ఆ భయం వల్లే తన దగ్గరకు ఎవరూ రాలేదని అందుకే తాను ఇంకా సింగిల్‌గా ఉండిపోయానని చమత్కరించారు. –అజయ్ – సమీర్ అప్పట్లో పెద్ద రౌడీల్లా ఉండేవారు. నేను ఎవరితోనైనా మాట్లాడుతుంటే చూసి ఊరుకునేవారు కాదు. అజయ్ చేసిన పనికి ఆయన ఇప్పుడు తప్పకుండా పశ్చాత్తాపపడాలి– అని టబు నవ్వేసారు. తాను పెళ్లి చేసుకోకపోవడానికి అజయ్‌ను బాధ్యుడిని చేస్తూనే ఓ సందర్భంలో –నాకో మంచి సంబంధం చూసి పెళ్లి చేయమని అజయ్‌నే అడిగాను– అని వెల్లడించారు. ఇద్దరి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధం ఈ వ్యాఖ్యల తో మరోసారి స్పష్టమవుతోంది. సినిమా ఇండస్ట్రీలో నటీనటుల మధ్య సంబంధాలు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పడం కష్టం. కానీ టబు అజయ్ మాత్రం 25 ఏళ్లుగా ఒకే రకమైన సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నారు. –విజయ్‌పథ్– నుండి ప్రారంభమైన ఇద్దరి ప్రయాణం –దృశ్యం–, –గోల్‌మాల్ అగైన్–, –భోలా– వంటి చిత్రాల వరకు విజయవంతంగా సాగుతోంది. తెరపై వీరి కెమిస్ట్రీ ఎంత బాగుంటుందో? వ్యక్తిగత జీవితంలోనూ ఒకరిపై ఒకరికి అంతటి గౌరవం , రక్షణ భావం ఉందని టబు అనేక సందర్భాల్లో రివీల్ చేసారు.

# దళపతి విజయ్ స్టార్ పవర్.. ఐఎండీబీలో ఏకంగా 21 నుంచి రెండో స్థానంలోకి



మన దక్షిణాది సినిమా దగ్గర భారీ స్టార్డం ఉన్న స్టార్ హీరోస్ లో దళపతి విజయ్ జోసెఫ్ కూడా ఒకరు. తన సినిమాలు కంటెంట్ అనుకున్న రేంజ్ లో లేకపోయినప్పటికీ ఫ్యాన్స్ వాటికీ వందల కోట్ల వసూళ్లు అందిస్తారు. మరి అలాంటి విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ఎవరూ ఊహించని నంబర్స్ సెట్ చేసి చరిత్ర సృష్టించారు. అయితే విజయ్ లేటెస్ట్ గా మరో క్రేజీ ఫీట్ ని సెట్ చేయడం విశేషం. ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ లో ఇండియన్ సెలెబ్రెటీస్ లిస్ట్ లో విజయ్ గత వారం వరకు 21వ స్థానంలో ఉంటే ఇప్పుడు ఏకంగా ఇండియా లోనే రెండో స్థానానికి చేరి విజయ్ తన స్టార్ పవర్ చూపించాడు. విజయ్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన కోసం ఎంతోమంది సెర్చ్ చేయగా ఈ ఫీట్ సాధ్యం అయినట్టు తెలుస్తుంది. దీనితో విజయ్ క్రేజ్ ఇండియా వైడ్ గా నెక్స్ట్ లెవెల్లోకి చేరుకుంది అని చెప్పొచ్చు. ఇక విజయ్ నుంచి నుంచి రానున్న రోజుల్లో తన ఆఖరి చిత్రం జన నాయగన్ వచ్చాక రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి.

# యూఎస్ మార్కెట్ లో సాలిడ్ మార్క్ అందుకున్న 'పెద్ది'



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కించిన మల్టీ స్పోర్ట్స్ డ్రామా పెద్ది ఇప్పుడు గ్రాండ్ రిలీజ్ కి రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న అభిమానులు యూఎస్ మార్కెట్ ఇలా బుకింగ్స్ ఓపెన్ చేయగానే రికార్డు రెస్పాన్స్ అందించారు. అయితే తర్వాత ఇవి కొంచెం నెమ్మదించిన సంగతి తెలిసిందే. ఇక లేటెస్ట్ గా పెద్ది సాలిడ్ మరో మార్క్ ని క్రాస్ చేసినట్టు డిస్ట్రిబ్యూటర్స్ చెబుతున్నారు. పెద్ది అక్కడ ఇప్పుడు 2 లక్షల 50 వేల డాలర్స్ మార్క్ ని దాటి అదరగొట్టింది. ఇంకా ట్రైలర్, ఇతర కంటెంట్ ఏమి రాలేదు కాబట్టి ఇది నెంబర్ అనే చెప్పొచ్చు. ఇక కంటెంట్ వచ్చాక గ్రాఫ్ ఏ మేరకు పెరుగుతుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

# కార్తీ సినిమా కోసం మరో డైరెక్టర్..





కోలీవుడ్ హీరో కార్తీ, 'మ్యాడ్' ఫేమ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమాపై ఇప్పటికే టాలీవుడ్ వర్గాల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాను ఇటీవల అధికారికంగా ప్రారంభించారు కూడా. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ వార్త సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో మరో డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని కూడా వర్క్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. 'మిరాయ్' వంటి చిత్రంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కార్తీక్, ఇప్పుడు కార్తీ సినిమా కోసం మరోసారి సినిమాటోగ్రాఫర్‌గా మారనున్నాడు. నిజానికి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై చందూ మొండేటి దర్శకత్వంలో రావలసిన 'వాయుపుత్ర' అనే యానిమేషన్ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని వర్క్ చేయాల్సి ఉంది. అయితే బడ్జెట్ కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ప్రస్తుతానికి వాయిదా పడటంతో, నిర్మాత నాగవంశీ ఆయన్ని కార్తీ సినిమాకు షిఫ్ట్ చేశారు. టెక్నికల్‌గా మంచి పట్టున్న కార్తీక్ ఘట్టమనేని ఈ ప్రాజెక్ట్‌లో చేరడం కళ్యాణ్ శంకర్ టీమ్‌కు పెద్ద బూస్ట్ అని చెప్పవచ్చు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com